సాక్షి
పల్నాడు

గురువారం । 14 । నవంబర్ । 2024




భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

రాజుపాలెం: గ్రామంలోని జయంతి కాలనీ శ్రీవైష్ణవ హరిదాసుల సంఘం ఆధ్వర్యంలో మంగళ కైశిక ద్వాదశి నగర సంకీర్తన బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదానానికి తెనాలికి చెందిన బొర్రా రవికుమార్ కుటుంబం బుధవారం రూ. 1.21 లక్షల విరాళం అందజేసింది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4709, హై లెవల్ కాలువకు 153 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

పిడుగురాళ్లలో వర్షం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నిన్నటి వరకు తీవ్రంగా ఎండలు కాయటంతో అల్లాడిన ప్రజలు బుధవారం ఉదయం నుంచి ఎండ తక్కువగా ఉండటంతో కాస్త ఊరట చెందారు. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం పడటంతో మరింత ఉపశమనం పొందారు. రైతులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

పల్నాటి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం



కారెంపూడి: పల్నాటి ఉత్సవాల నేపథ్యంలో సౌకర్యాల కల్పనకు బుధవారం శ్రీకారం చుట్టారు. జేసీబీతో ఉత్సవాల ప్రాంగణాన్ని శుభ్రం చేసే పనులు చేశారు. వీరాచారవంతులకు, ఇతరులకు వసతులు కల్పించాలనే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని టీడీపీ నాయకుడు పంగులూరి అంజయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాన్సర్ సర్వే



నరసరావుపేట: జిల్లాలో గురువారం నుంచి ఎన్‌సీడీసీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ అండ్ కమ్యూనికేబుల్ డిసీజెస్) సర్వేలో భాగంగా క్యాన్సర్‌పై ఇంటింట సర్వే నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి వ్యక్తుల వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. 18 ఏళ్ల పైబడిన వారందరికీ రక్తం, బీపీ, మధుమేహం పరీక్షలు చేస్తారన్నారు. క్యాన్సర్ గురించి వివరించి ఒప్పుకున్న వారందరికీ ఎన్‌డీపీ (నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్)కి తీసుకొచ్చి మహిళా డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పరీక్షలు చేస్తారన్నారు. వీరి ద్వారా సేకరించిన నివేదిక ద్వారా క్యాన్సర్‌కు గురైనట్లు అనుమానం ఉన్న వారిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళతారని తెలిపారు. వైద్యసిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ నెల 15న చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ఉందని, దీనిని వైద్యఆరోగ్యశాఖ మంత్రి విజయవాడలో ప్రారంభిస్తారన్నారు. అంగన్వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

పోసాని కృష్ణమురళీపై టీడీపీ నేతల ఫిర్యాదు

నరసరావుపేట టౌన్: సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళీపై స్థానిక టీడీపీ నాయకులు బుధవారం పల్నాడు జిల్లా నరసరావుపేట టుటౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ హైమారావుకు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను అసభ్య పదజాలంతో దూషించినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అలీ బాషా, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి మహమద్ రఫీ ఉన్నారు.

కౌశల్ పోటీలకు దరఖాస్తు చేయండి



నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు కౌశల్–2024 పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని పేర్కొన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె సంబంధిత పోస్టర్‌ను విడుదల చేశారు. పోటీలు క్విజ్, పోస్టర్ పెయింటింగ్ విభాగాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారని వివరించారు. విద్యార్థులను సమాయత్తం చేయాలని కోరారు. 87902 90997, 99590 04434 ఫోను నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విజ్ఞాన బంధాలయాలు !

- నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
- వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు
- వేడుకలకు నిధులు కూడా విడుదల చేయని కూటమి ప్రభుత్వం

సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 57వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా వారం పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 14న బాలల దినోత్సవం కూడా జరపనున్నారు. 15న ఆయా గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు ఉంటాయి. మాదకద్రవ్యాలతో అనర్థాలు, పుస్తక పఠనం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. 16న గ్రంథాలయ ఉద్యమానికి విశేషంగా కృషి చేసిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య తదితర ప్రముఖులకు నివాళి అర్పించనున్నారు. 17న కవి సమ్మేళనాలు, సదస్సులు, రచయితల సందేశాలు, వివిధ అంశాలపై సదస్సులు నిర్వహిస్తారు. 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, క్రీడా పోటీలు ఉంటాయి. 19న మహిళలకు రంగవల్లి, అల్లికలు వంటి పోటీలు నిర్వహిస్తారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, వీ లవ్ రీడింగ్, వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.



గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలిస్తున్న నిరుద్యోగులు



గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 98 గ్రంథాలయాలు, 32 గ్రామీణ గ్రంథాలయాలు, 103 పుస్తక పంపిణీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, 7 ప్రథమ, 11 ద్వితీయ, 79 తృతీయ శ్రేణి గ్రంథాలయాలు, 103 పుస్తక డిపాజిట్ సెంటర్లు ఉన్నాయి. 70 గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. 14 అద్దె భవనాల్లో, 14 ఉచిత అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా లైబ్రరీల్లో 10,52,370, ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. 1,07,807 మంది గ్రంథాలయాల్లో సభ్యత్వం కలిగి ఉన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రిఫరెన్స్ విభాగంలో పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సేవలు అందిస్తున్నారు. ఈ విభాగంలో ఏసీ, 20 కంప్యూటర్లతో ఇంటర్నెట్ వసతి ఉంది. జిల్లాలో 6 ప్రథమ శ్రేణి, 12 ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయాల డిజిటలైజేషన్‌కు ఇంటర్నెట్ సదుపాయం కల్పించనున్నారు.

పట్టించుకోని కూటమి సర్కారు

వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి జిల్లా గ్రంథాలయ సంస్థకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ. 35 వేలు, పురపాలక సంఘాల్లో ఉన్న ప్రథమ శ్రేణి వాటికి రూ.15 వేలు, ద్వితీయ శ్రేణి లైబ్రరీలకు రూ.11 వేలు చొప్పున నిధులు మంజూరు చేసింది. వీటితోపాటు పట్టణాల్లోని ద్వితీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ. 8 వేలు, మండల కేంద్రాల్లో ఉన్న తృతీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ, 6 వేలు, మండల హెడ్ క్వార్టర్స్‌లోని తృతీయ శ్రేణి గ్రంథాలయాలకు రూ.5 వేలు వంతున ఇచ్చింది. వీటితో ఆహ్వాన పత్రాలు ముద్రించుకోవడం, ఫ్లెక్సీలు, బ్యానర్లకు వినియోగించుకోవడం, మైక్‌సెట్‌కు, ఫొటోలకు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులుగా ఇచ్చే పుస్తకాలకు ఖర్చు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు వేడుకలకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. దీంతో వారోత్సవాల ఖర్చుల భారం ఆయా గ్రంథాలయాల నిర్వాహకులపై పడనుంది.

ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లాలోని గ్రంథపాలకులందరికీ ఆదేశాలు జారీ చేశాం. ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం. గ్రంథాలయాల నిర్వహణకు బడ్జెట్ కేటాయింపు ప్రతిపాదనలు పంపాం.

– వంకదారి సుబ్బరత్నమ్మ, కార్యదర్శి, ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ

అవగాహనతోనే ప్రాణనష్టం నివారణ

విపత్తు సమయాల్లో జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

అమరావతి: ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల కలిగే ప్రమాదాలపై ముందస్తు అవగాహన ఉంటే వాటి వల్ల జరిగే ప్రాణ నష్టాన్ని చాలా వరకు తగ్గించవచ్చని ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ వీవీఎన్ ప్రజ్ఞ అన్నారు. వరద సమయంలో ప్రాణాలను కాపాడటానికి నిర్వహించే మాక్ డ్రిల్ కృష్ణానదిలో బుధవారం మండల పరిధిలోని ధ్యానబుద్ధ ఘాట్‌లో 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్తులపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీవీఎన్ ప్రజ్ఞ మాట్లాడుతూ .. వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, తుపానులు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినపుడు వాడవలసిన వస్తువులు, ప్రాథమికంగా చేయాల్సిన పనులు తెలియకపోవడంతో గ్రామీణ ప్రాంతాలలో వందలాది మరణిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో వరదలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ సమయంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లవచ్చులే అనే నిర్లక్ష్యం ఎంతో మంది ప్రాణాలు బలిగొంటోందని తెలిపారు. ప్రజలు విపత్తుల నివారణకు ఉపయోగించే వస్తువులు, విధానాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ బృందం వరదలలో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడం, అలాగే నీట మునిగిన వారిని ప్రథమ చికిత్స అందించడం వంటి అంశాలను మాక్‌డ్రిల్ చేసి చూపించారు. ఆర్డీఓ రమాకాంతరెడ్డి, సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్ మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.

పీక్‌కు చేరిన 'పచ్చ' ప్రచారం

- స్పీడ్ బ్రేకర్లకూ పసుపు రంగు
- విస్తుపోతున్న వాహనదారులు



సత్తెనపల్లిలో పసుపు రంగు స్పీడ్ బ్రేకర్

సత్తెనపల్లి: నవ్విపోతే నాకేంటీ.. నాకు కావాల్సింది కేవలం ప్రచారమే అన్నట్లు ఉంది తెలుగుదేశం పార్టీ నేతల పరిస్థితి. ప్రస్తుతం టీడీపీ రంగుల ప్రచారం పీక్‌కు చేరింది. అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం పసుపు రంగులను వేస్తూ కాలం గడుపుతోంది. జాతీయ రహదారులపై స్పీడ్ బ్రేకర్లను వేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. కానీ వాహనాల రద్దీ దృష్ట్యా ప్రమాదాల నియంత్రణలో భాగంగా పేరేచర్ల –కొండమోడు రహదారి పరిధిలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో హోలీ ఫ్యామిలీ పాఠశాల సమీపంలో రహదారిపై స్పీడ్ బ్రేకర్లను రెండు రోజుల క్రితం ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఉండడంతో రోడ్డుకు రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయగా వాటికి రేడియం స్టిక్కర్‌కు బదులుగా పసుపు రంగు వేశారు. కేవలం స్పీడ్ బ్రేకర్ వరకు వేయడంతో ప్రమాదం పొంచి ఉంది. దీనిని చూసిన వాహనదారులు చెప్పుకోవడానికి చేసిందేమీ లేక చివరకు స్పీడ్ బ్రేకర్లకు కూడా పసుపు రంగు వేసుకుంటున్నారు కాబోలు అంటూ విస్తుపోతున్నారు.

వ్యక్తి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పట్టాభిపురం ఎస్సై నరహరి, పక్కన క్లూస్ టీమ్ సిబ్బంది



గౌస్ మృతదేహం

- గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్లో ఘటన
- ఓ టెంట్ హౌస్ వద్ద అరుగుపై నిద్రిస్తుండగా దారుణం
- టెంట్ హౌస్ యజమానికి గతంలో నగదు వడ్డీకి ఇచ్చినట్లు గుర్తింపు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పట్టాభిపురం పోలీసు అధికారులు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : గుంటూరు గుజ్జనగుండ్ల సెంటర్లో టెంట్ హౌస్ వద్ద ఫుట్ పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. షేక్ గౌస్ (60) గతంలో గుజ్జనగుండ్ల ప్రాంతంలో నివాసం ఉండేవాడు. గౌస్‌కు ముగ్గురు సంతానం. కుమార్తెలిద్దరూ రొంపిచర్ల, విప్పర్ల గ్రామాల్లో ఉంటారు. కుమారుడు నరసరావుపేటలో సమోసాలు అమ్ముతూ జీవిస్తున్నాడు. గౌస్ నగరంలోని కొంత మందికి సుమారు రూ.4 లక్షల వరకు వడ్డీకి ఇచ్చాడు. వచ్చిన వడ్డీతో జీవనం సాగిస్తున్నాడు. కొద్దికాలం పాటు గౌస్ నరసరావుపేటలోని కొడుకు వద్దే ఉన్నాడు. తండ్రీకొడుకుల మధ్య చిన్నపాటి వివాదం జరగడంతో కుమారుడి వద్ద నుంచి అలిగి రొంపిచర్ల మండలం విప్పర్లలో ఉండే కుమార్తె వద్దకు వెళ్లి ఉంటున్నాడు. గౌస్ గతంలో గుజ్జనగుండ్లలోని టెంట్ హౌస్ యజమాని శ్రీనుకు రూ.2 లక్షలు వడ్డీకి ఇచ్చాడు. ప్రతినెలా వచ్చి వడ్డీ డబ్బులు కుమార్తెకు ఫోన్ పే చేయించుకుని వెళ్తుంటాడు.

40 రోజుల క్రితం గుంటూరుకు...

ఈ నేపథ్యంలో వడ్డీ డబ్బుల కోసం అని 40 రోజుల క్రితం గుంటూరు వచ్చిన గౌస్ మళ్లీ విప్పర్ల వెళ్లలేదు. టెంట్ హౌస్ శ్రీనును వడ్డీ డబ్బులు అడుగుతూ టెంట్ హౌస్ ముందర ఉన్న ఫుట్ పాత్‌పైనే నిద్రపోతున్నాడు. వడ్డీలు రావల్సిన వారి నుంచి వసూలు చేసుకుని అతని వద్దనే ఉంచుకున్నాడు. మంగళవారం రాత్రి కూడా టెంట్ హౌస్ ముందరే పడుకున్నాడు. ఉదయమే స్థానికులు రక్తపుమడుగులో పడి ఉన్న గౌస్‌ను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగినట్టు నిర్ధారించుకుని విచారణ చేపట్టారు. అనుమానితులైన టెంట్‌హౌస్ యజమానిని, మరి కొందరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని పలు కీలకమైన ఆధారాలను సేకరించింది. పట్టాభిపురం పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న మృతుడి కుమార్తె ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమైంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గౌస్ మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇదిలా ఉంటే గంజాయి రవాణా, చోరీలు, పేకాట శిబిరాలు, హత్యలు, హత్యాయత్నాలు యథేచ్ఛగా జరుగుతున్నా.. పోలీసులు నైట్ బీట్లపై దృష్టిపెట్టడం లేదు. నైట్ బీట్ లేకపోవడం వల్లే నేరాలు పెరిగిపోతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఓకే మొదలెడదాం..!

పల్నాడులో 'కే' టార్చర్ మళ్లీ మొదలు

చిల్లర కొట్టు ప్రారంభించాలన్నా కే ట్యాక్స్... ఏదైనా వ్యాపారం చేయాలన్నా కే ట్యాక్స్.. భూములు కొనాలన్నా కే ట్యాక్స్.. బదిలీపై వచ్చి ఉద్యోగంలో చేరాలన్నా కే ట్యాక్స్.. ప్రతి పనికీ కే ట్యాక్స్.. చివరకు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఊపిరి పీల్చాలన్నా కే ట్యాక్స్ కట్టాలేమో అన్నంతగా భయ భ్రాంతులకు గురి చేశారు కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామ్, కూతురు లక్ష్మి. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక బాధితులు పోలీసు గడప తొక్కడంతో కోడెల బ్యాచ్ కోర్టుల మెట్లెక్కారు. చట్టాల్లో లొసుగులతో స్టేలు తెచ్చుకున్న వీరు.. మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చాక బెదిరింపులు ప్రారంభించారు.

- గత టీడీపీ ప్రభుత్వంలో కే ట్యాక్స్ వసూలు
- సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో కోడెల వారసుల అరాచకాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- కూటమి వచ్చాక రాజీ పడాలని బాధితులకు పోలీసుల బెదిరింపులు



సాక్షి టాస్క్‌ఫోర్స్: 2014లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన వెంటనే కోడెల శివప్రసాద్‌కు శాసనసభ స్పీకర్ పదవి అప్పగించారు. బీజేపీతో పొత్తులో భాగంగా నరసరావుపేట అసెంబ్లీ సీటు ఆ పార్టీకి కేటాయించారు. దీంతో అప్పటివరకు నరసరావుపేట నుంచి అనేక పర్యాయాలు గెలుపొంది పదవులు అనుభవించిన కోడెల సత్తెనపల్లిలో పోటీ చేసి గెలుపొందారు. నరసరావుపేటలో బీజేపీ అభ్యర్థి నల్లబోతు వెంకట్రావు ఓటమి చెందటంతో కోడెల రెండు నియోజకవర్గాలపై ఆధిపత్యం చెలాయించారు. ఇక తండ్రి చేతికి అధికారం రావడంతో పెత్తనం మొత్తం కొడుకు శివరామ్, కూతురు లక్ష్మి చేతికి చేరింది. తండ్రిని అధికార పీఠంపై అలంకారంగా కూర్చోబెట్టి.. కూతురు, కొడుకు అరాచకాలకు తెగబడ్డారు. ఒక దశలో నరసరావుపేట, సత్తెనపల్లి రెండు నియోజకవర్గాల్లో 'కే' ట్యాక్స్ పేరు చెబితే ప్రజలు సైతం వణికిపోయేలా అక్రమాలు చేశారు. ఎక్కడ చిన్న వ్యాపారం ప్రారంభించినా కప్పం కట్టాల్సిందేనని అడ్డగించారు. మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి బలవంతపు వసూళ్లకు పాల్పడ్డారు. ఆదాయ వనరుగా ఉన్న కేబుల్ వ్యవస్థను బలవంతంగా హస్తగతం చేసుకున్నారు. వివాదంలో ఉన్న భూములను గుర్తించి కబ్జాలు చేశారు. కప్పం కట్టకుంటే దాడులు, అక్రమ కేసులతో భయపెట్టారు.

బాధితుల్లో ఆందోళన...

కోడెల కుటుంబం చేతిలో నష్టపోయిన బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కేసులు రాజీ పడకపోతే ఇబ్బందులు తప్పవని, క్రిమినల్ కేసులు పెట్టేందుకు సైతం వెనుకాడమని కొంతమంది పోలీసు అధికారులు బెదిరిస్తున్నారు. ఇప్పటికే అనేకసార్లు నరసరావుపేట, సత్తెనపల్లి రెండు నియోజకవర్గాల్లో ఫిర్యాదుదారులను స్టేషన్‌కు పిలిచి గంటల కొద్ది నిలబెట్టి కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు తెలియవచ్చింది. ఓ వైపు కోడెల అనుచరులు, మరోవైపు పోలీసులు వేధింపులతో బాధితులు తప్పనిసరి పరిస్థితుల్లో కేసులు ఉపసంహరించుకునేందుకు అంగీకరిస్తున్నారు. మరికొందరు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. తాము నష్టపోయిన సొమ్ము తిరిగి ఇస్తే రాజీ పడతామని కొందరు పోలీసులకు తేల్చిచెప్పారు. తమపై వేధింపులు ఇలానే కొనసాగితే హైకోర్టును ఆశ్రయించాలన్న ఆలోచనలతో పలువురు బాధితులు ఉన్నట్టు సమాచారం.

'కేసులు వాపస్ తీసుకోవాలని బెదిరింపులు...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక కోడెల శివరామ్, లక్ష్మి తమపై ఉన్న కేసులను సెటిల్ చేసుకునే పనిలో ఉన్నారు. తాము అధికారంలో ఉన్నామని చెప్పి బాధితులను పోలీస్ స్టేషన్లకు రప్పించి బెదిరింపులకు పాల్పడుతున్నారు. రాజీ చేసుకోకపోతే క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుంటారని కొంత మంది పోలీసుల ద్వారా బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే సుమారు పది కేసుల్లో బాధితులను స్టేషన్లకు పిలిపించి రాజీ కుదిర్చినట్లు సమాచారం. మిగిలిన కేసుల్లో బాధితులపైనా ఒత్తిడి చేస్తున్నారు. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులను ప్రోత్సహిస్తున్నారు. రూపాయి రూపాయి కూడబెట్టుకున్న సొమ్ము అక్రమంగా లాగేసుకున్నారని, కనీసం తమకు న్యాయం జరుగుతుందని పోలీస్ స్టేషన్ మెట్లెక్కితే ఇక్కడా అన్యాయం జరుగుతోందని బాధితులు వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ రాకతో బయటికొచ్చిన బాధితులు...

గత టీడీపీ హయాంలో 'కే' ట్యాక్స్ బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోగా బాధితులపైనే తిరిగి అక్రమ కేసులు బనాయించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకొచ్చాక ధైర్యంగా పోలీసు స్టేషన్లకు వెళ్లారు. చిన్నాచితకా వ్యాపారులు మాత్రం పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగలేక మౌనం వహించారు. అధిక మొత్తం నష్టపోయిన బాధితులు మాత్రం పోలీసుల వద్ద తమ గోడు వెళ్లబోసుకుని, న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇలా కోడెల ఫ్యామిలీపై అప్పట్లో 25కు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే అధిక కేసుల్లో కోడెల సంతానం ముందస్తు బెయిల్ పొందారు. కొన్ని కేసుల్లో స్టేలు తెచ్చుకున్నారు. చట్టాల్లో లొసుగులను ఆసరాగా చేసుకుని బయట దర్జాగా తిరుగుతున్నారు.

శబరిమల యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్ఎం రవికాంత్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): అయ్యప్ప స్వాముల శబరిమల యాత్రకు, కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచారామాలకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం ఎం. రవికాంత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో స్పెషల్ బస్సులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. శబరిమల వెళ్లే సమయంలో బస్సు సర్వీసు కాణిపాకం, భవానీ, ఎరిమేలి, పంబా మీదుగా వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు కుర్తాళం, మధురై, చెన్నై, మేల్‌మరవత్తూరు మీదుగా గుంటూరు చేరుకుంటుందని పేర్కొన్నారు. పంచారామాలకు ఒకేరోజులో సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి దర్శనం కల్పిస్తారన్నారు. ఒకేరోజులో త్రి శైవక్షేత్రాలు యాగంటి, మహానంది, శ్రీశైలం, దర్శించుకునేందుకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బస్సులు ప్రతి శని, ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలేదరుతాయని వివరించారు.

ముగిసిన వర్సిటీ మహిళా కబడ్డీ పోటీలు

విజేతగా కృష్ణవేణి కళాశాల



ప్రథమ స్థానం సాధించిన కృష్ణవేణి కళాశాల జట్టు

నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి 11 జట్లు పోటీలు పాల్గొన్నాయి. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతితో నిర్వహించిన పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానం సాధించి కప్పు కైవసం చేసుకొంది. వర్సిటీ వ్యాయామ విద్య కళాశాల ద్వితీయ, జె.ఎం.జె కళాశాల (తెనాలి) తృతీయ స్థానం సాధించగా, విక్టరీ డిగ్రీ కళాశాల నాల్గవ స్థానంలో నిలిచింది. కళాశాలలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, పోటీల పరిశీలకుడు డాక్టర్ డి.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ చుండు వెంకటరావు, డాక్టర్ కె.అరుణ సుజాత, ఎం.గణేష్ తదితరులు పాల్గొన్నారు.